సాక్షి
బాపట్ల
శనివారం | 3 | మే | 2025



అమరేశ్వరుని సేవలో ఐజీ


అమరావతి: శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని శుక్రవారం ఐజీ లవకుమార్ దర్శించుకున్నారు. స్వామివారికి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



ఆలయ కలశాలకు అభిషేకం

దుగ్గిరాల: కేఆర్ కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఆలయ శిఖర కలశాలు, విగ్రహాలకు ఆవుపాలతో అభిషేకం, హోమం నిర్వహించారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



చిలకలూరిపేట: రజక కాలనీలోని ఈశాన్య ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

న్యూస్‌రీల్

విజయకీలాద్రిపై తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై శుక్రవారం తిరునక్షత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో 1008వ భగవద్రామానుజాచార్య స్వామి వారి తిరునక్షత్ర మహోత్సవంలో భాగంగా ఉదయం 9 గంటలకు అభిషేకం, సేవాకాలం, అర్చన కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు వాహన సేవ, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామన్నారు. భక్తులు అధిక సంఖ్యల పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

శాప్ ఆధ్వర్యంలో కబడ్డీ క్యాంప్



వినుకొండ: శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ వరకు కబడ్డీ క్యాంప్ స్థానిక కారంపూడి రోడ్డులోని విద్యావికాస్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు కోచ్ కోమటిగుంట శ్రీహరి తెలిపారు. ఈ క్యాంప్‌ను శుక్రవారం డీసీ చైర్మన్ గంగినేని రాఘవరావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్, పీఈటీ రాధాకృష్ణమూర్తి, వినుకొండ జోన్ ప్రెసిడెంట్ గణప వీరాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8008285430 నంబరులో సంప్రదించాలన్నారు.

యతీశ్వరుల చిత్ర పటాలతో ప్రదర్శన



కొల్లూరు: శంకర జయంతిని పురస్కరించుకుని ఆది శంకరాచార్యులు, రామచంద్రేంద్ర సరస్వతి యతీశ్వరులు చిత్రపటాలతో కొల్లూరులో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. వేద పరీక్షలు, పండిత సన్మాన సభలు శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు కొల్లూరులోని శ్రీ పార్వతీ సంస్కృత పాఠశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణకు అధ్యక్ష, కార్య దర్శులుగా గబ్బిట శివరామకృష్ణప్రసాద్, తాడేపల్లి వెంకటసింహాద్రిశాస్త్రి వ్యవహరిస్తారన్నారు.

7 నుంచి కళాపరిషత్ నాటిక పోటీలు



పొన్నూరు: పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ శత జయంతిని పురస్కరించుకుని 24వ తెలుగు రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 10 వరకు నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికపై పోటీలు జరుగుతాయన్నారు. ఎస్.అంజనేయులునాయుడు, ఎస్.రఘునాథ్, ఆకుల సాంబశివరావు, ఎం.విజయ్‌కుమార్ రెడ్డి, డాక్టర్.దేసిబాబు, మురళీకృష్ణ, జి.తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



అమరావతి: అమరేశ్వరుని దేవస్థానంలో శుక్రవారం ఆదిశంకరాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. శంకరాచార్య విగ్రహానికి ఆలయ అర్చకుడు శంకరమంచి రాజశేఖర శర్మ పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషాలంకారం, ప్రత్యేక పూజలు చేసి బ్రాహ్మణులకు విసన కర్రలు, మామిడి పండ్లు పంపిణీ చేశారు.

బుకీ బూచీ.. బెట్టింగ్ ఛీఛీ !



- క్రికెట్ బెట్టింగ్ స్వైర విహారం
- అప్పుల ఊబిలో పేదల బతుకులు
- ట్రాప్‌లో పడుతున్న వ్యాపారులు, ఇంజినీరింగ్ విద్యార్థులు

చీరాలటౌన్: ఉత్కంఠ.. ఉద్వేగంతో సాగే ఐపీఎల్ క్రికెట్ పోటీలు కొందరికి ఉల్లాసం కలిగిస్తుంటే మరి కొందరికి మరణదండనగా మారుతోంది. క్రికెట్ బెట్టింగ్ భూతం చీరాల ప్రాంతంలో చెలరేగిపోతోంది. ఇంజినీరింగ్ విద్యార్థులు, రోజు వారీ కూలీలు సైతం బెట్టింగ్ ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. చీరాల పట్టణంలో ముంతావారి సెంటర్, కొట్ల బజారు, పేరాల తదితర ప్రాంతాల్లో భారీగా బెట్టింగ్‌లు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

వేటపాలెం నుంచి ఈపూరుపాలెం వరకు పెద్ద ఎత్తున బుకీలుగా వ్యవహరించే ఏజెంట్లు కరెన్సీ వల విసురుతున్నారు. గతంలో ఒకేచోట సిట్టింగ్‌లు పెట్టుకోవడంతో పోలీసులకు సులభంగా చిక్కేవారు. ప్రస్తుతం వారి రూటు సప'రేటు' అయింది. బెట్ 365 అనే ఆన్‌లైన్ యాప్‌తో గేమ్ నడిపిస్తున్నారు. టీవీలో ఆట చూస్తూ ఫోన్ల ద్వారానే బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసుల నిఘాకు అందకుండా ఇంట్లోనే ఉంటూ బుకీ ఏజెంట్లు బెట్టింగ్ చేసే వారితో పందేలు కాయిస్తున్నారు. ప్రతి బంతికీ.. ప్రతి ఓవర్‌కు బెట్టింగ్ కాస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో పేదలు కూడా ఈ ఉచ్చులో చిక్కుకుని గిలగిల్లాడుతున్నారు.

చావు డప్పు మోగుతున్నా..

బెట్టింగ్ వల్ల గతంలో ఎంతోమంది అప్పుల పాలవడంతోపాటు ఆత్మహత్యలకు పాల్పడినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కాగా ఇటీవల బెట్టింగ్ డబ్బు చెల్లించలేని వారు దొంగతనాలకు పాల్పడటం సాధారణంగా జరుగుతోంది. అలాగే ఈ పద్ధతి మంచిది కాదు అని చెప్పిన భార్యను ఓ వ్యక్తి హత్య చేసిన ఉదంతాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి.



చీరాల పట్టణ వ్యూ

ఉదంతాలు ఇవిగో..

విచక్షణ మరిచాడు భార్యను హత మార్చాడు

- గత నెల ఈపురుపాలేనికి చెందిన ఒక వ్యక్తి బెట్టింగ్‌లో సుమారు రూ. లక్ష వరకు డబ్బు పోగొట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా భార్య భద్రపరిచిన రూ.20 వేలు కూడా వదిలించుకున్నాడు. ఇలా ఎందుకు చేస్తున్నావు అని ప్రశ్నించిన ఆరు నెలల బాలింత అయిన భార్యను కిరాతకంగా కొట్టి హతమార్చాడు. ప్రస్తుతం అతను జైల్లో ఉండగా.. తల్లి చనిపోవడంతో మూడు సంవత్సరాల పాప, ఆరు నెలల బాబు దగ్గరలోని వృద్ధ దంపతుల వద్ద ఆశ్రయం పొందుతున్నారు.

128 సవర్ల బంగారం కాజేశారు..

- చీరాల్లో సంచలనంగా మారిన 128 సవర్ల బంగారం, రూ.1.50 లక్షల నగదు కాజేసిన నిందితులు కూడా బెట్టింగ్ బానిసలే. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా, మెకానిక్‌గా పనిచేస్తున్న ఇద్దరు యువకులు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు వేసి లక్షలు నష్టపోయారు. అవి తీర్చడానికి వివిధ రకాల ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకున్నారు. ఇక ఒత్తిడి పెరగడంతో ఓ ఇంట్లో దొంగతనం చేసి 128 సవర్ల బంగారం, రూ.1.50 లక్షల నగదు కాజేశారు. పోలీసులు గంటల వ్యవధిలోనే వారికి అరదండాలు వేసి జైల్లో కుక్కేశారు.

ఊరి నుంచి పరారీ

- ఈపురుపాలేనికి చెందిన ఒకరు, జాండ్రపేటకు చెందిన మరో వ్యక్తి క్రికెట్ బెట్టింగ్‌లో లక్షలు పోగొట్టుకున్నారు. అప్పులు చెల్లించలేక, ఇంట్లో వారిని ఇబ్బందులు పెట్టలేక ఎవరికీ చెప్పకుండా వేరే ఊరికి వెళ్లిపోయారు. ఇలా చెప్పుకుంటూ పోతే చీరాల ప్రాంతంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బాధితుల సంఖ్య పెద్ద మెమరీ కార్డులా మారిపోతోంది.

చీరాలలో 10 మందికి పైగా పెద్ద బుకీలు.. ఏజెంట్లు

రోజువారీ కూలీలు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు అధికంగా ఉండే చీరాల్లో క్రికెట్ బుకీలు, ఏజెంట్లకు కొదువ లేదు. చీరాల నియోజకవర్గంలో పేరు మోసిన బుకీలు, ఏజెంట్లు లక్షలు సంపాదిస్తూ పేదల రక్తాన్ని తాగుతున్నారు. జాండ్రపేటలో ఇద్దరు, వేటపాలెంలో ఇద్దరు, ఈపూరుపాలెంలో ఇద్దరు ఏజెంట్లు, చీరాల ప్రాంతాల్లో నడుపుతున్నారు. పోలీసులకు సమాచారం తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ డబ్బు లావాదేవీలంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఫలితాన్ని బట్టి డబ్బు అందుతుంది. ఇందుకు నమ్మకస్తులను మాత్రమే ఎంచుకుంటున్నారు. నమ్మకంలేనివారి వద్ద ముందే డబ్బు డిపాజిట్ చేసుకుంటున్నారు.

బెట్టింగ్ ఎలా కాస్తున్నారు?

బెట్టింగ్ కాసేవారు తమకు అనువుగా మ్యాచ్‌లను మార్చుకుంటున్నారు. టీవీ చూస్తూ ఓవర్‌లో ఎన్ని రన్స్ కొడతారు.. ఈ బంతి సిక్స్.. ఫోర్.. డబుల్ రన్....ఈ ఓవర్‌లో వికెట్ పడుతుంది.. ఇలా బెట్టింగ్‌లు కడుతున్నారు. టీవీల వద్ద కొందరు ఇలా పందేలు కాస్తున్నారు. అయితే బుకీ ఏజెంట్లు మాత్రం యువకులు, బంగారు వ్యాపారులు, వస్త్ర వ్యాపారుల వద్ద లక్షలాది రూపాయల పందేలు నిర్వహిస్తున్నారు. టాస్ మొదలుకొని ప్రతి బంతికి ఎన్ని రన్స్ కొడతారు.. ఎన్ని వికెట్లు తీస్తారు.. ఏ వికెట్ ఎప్పుడు పడుతుందో అని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు. కంప్యూటర్‌తో పాటు ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు బుకీల ద్వారా సమాచారం తెలుసుకుని స్థానికంగా బెట్టింగ్‌లు వేస్తున్నారు. వీరంతా బుకీలకు ఏజెంట్లుగాను, చిన్న బుకీలుగా వ్యవహరిస్తున్నారు. నమ్మకంగా ఉంటూ పందేలు కాసేవారిని ఏర్పాటు చేసుకుంటున్నారు.

సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయండి



ఆరోగ్య సర్వే పరిశీలిస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ

చినగంజాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సార్వత్రిక ఆరోగ్య పరీక్షల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ సూచించారు. శుక్రవారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రధానంగా మండలంలో నిర్వహిస్తున్న సార్వత్రిక ఆరోగ్య పరీక్షల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సార్వత్రిక ఆరోగ్య పరీక్షలకు సంబంధించి జిల్లాలో సర్వే మెరుగుగా ఉందని చినగంజాం మండలంలోని చినగంజాం-1 సెంటర్‌లో సిబ్బంది కొరత కారణంగా సర్వే వెనుకబడి ఉందని వేరే సెంటర్ నుంచి సిబ్బందిని ఏర్పాటుచేసి చేయాలని సూచించామన్నారు. నాన్ డిసీజ్ కమ్యూనిటీ సర్వేలో భాగంగా డయాబెటిస్, హైపర్ టెన్షన్, క్యాన్సర్ వంటి రోగాలకు సంబంధించి ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తారన్నారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా చేసి.. 30 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఆసుపత్రిని సీహెచ్‌సీగా మార్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ సంక్షేమ ఆపరేషన్‌లు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీసీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ లలితా రాజేశ్వరి, వైద్యాధికారి డాక్టర్ సాయి శ్రీచరణ్, హెడ్ నర్స్‌లు, ఏఎన్ఎంలు హెల్త్ ఎడ్యుకేటర్‌లు, హెల్త్ విజిటర్‌లు, చిరంజీవి, మురళి, ఆరోగ్య సిబ్బంది, 104 కంప్యూటర్ ఆపరేటర్ పాదిలి రాఘవ పాల్గొన్నారు.



ఖాళీ మద్యం సీసాల బుట్ట నెత్తిన పెట్టుకుని నిరసన తెలుపుతున్న అశోక్‌కుమార్

వరికూటి ఆందోళనతో కదిలిన ఎక్సైజ్ శాఖ

- మద్యం షాపుల్లో తనిఖీలు
- పలు బెల్టు షాపులపై కేసులు
- ఫిర్యాదు చేస్తే చర్యలకు సిద్ధమన్న ఎక్సైజ్ పోలీసులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: మద్యం బెల్టు షాపులపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు చేపట్టిన వినూత్న నిరసన ఫలితాన్నిచ్చింది. ఆయన చేపట్టిన ఆందోళనకు ఎక్సైజ్ శాఖ స్పందించింది. శుక్రవారం వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలంలో పలు మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు.

పల్లెకోన గ్రామంలో మద్యం అమ్ముతున్న సుబ్బారావుని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు రేపల్లె స్టేషన్ పరిధిలో 35 కేసులు, భట్టిప్రోలు మండలంలో 15 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఏ గ్రామంలోనైనా బెల్టు షాపులు, పర్మిట్ రూములు నిర్వహిస్తే రేపల్లె ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఫోన్ నంబర్ 9440902476 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



భట్టిప్రోలులో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

బెల్టుషాపులు నిరోధించే వరకూ ఉద్యమం

– వరికూటి అశోక్‌బాబు

వేమూరు నియోజకవర్గంలో బెల్టుషాపుల తోపాటు పర్మిట్ రూములు నిరోధించేవరకూ ఉద్యమాన్ని నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఈ ఉద్యమాన్ని రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలు కాకుండా ప్రజలకు మద్యం సరఫరా చేస్తోందన్నారు. వాడవాడలా మద్యం దుకాణాలు ఏర్పాటుతో ఆ మద్యం సేవించి పేదలు ఎస్సీ,ఎస్టీ,బలహీన వర్గాలు ఆర్థికంగా చితికి పోతున్నాయన్నారు. తక్షణం బెల్టుదుకాణాలు, పర్మిట్ రూములను నిలిపి వేయాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అశోక్‌బాబు హెచ్చరించారు.

మోదీ సభతో పల్లె వెలుగు బస్సులు రద్దు

బల్లికురవ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి సభ నిర్వహించిన నేపథ్యంలో బల్లికురవ మండలంలోని సింగిల్ రూట్ పల్లెవెలుగు బస్సులకు శుక్రవారం బ్రేక్ పడింది. అద్దంకి డిపో నుంచి బల్లికురవ సంతమాగులూరు మీదుగా నరసరావుపేటకు వెళ్లే బస్సు, అద్దంకి నుంచి బల్లికురవ, మార్టురు మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సు, అద్దంకి నుంచి వైదన, బల్లికురవ మీదుగా చిలకలూరిపేటవెళ్లే బస్సు, అద్దంకి నుంచి వెలమవారిపాలెం వెళ్లే బస్సులను రద్దుచేశారు. వీటితోపాటు కొప్పెరపాడు మీదుగా వినుకొండ, నరసరావుపేట వెళ్లే బస్సులు నిలిపివేశారు. సింగిల్ రూట్‌లో బస్సులు రద్దుతో ప్రయాణికులు వ్యయ ప్రయాసలతో ప్రమాద భరితమై ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. చిలకలూరిపేట డిపో నుంచి మార్టూరు, బల్లికురవ, కొమ్మాలపాడు మీదుగా కుందుర్రు వెళ్లే సింగిల్ రూట్ బస్సు మాత్రం యథావిధిగా నడిపారు.

కూలిన మురుగు కాల్వ కల్వర్టు



ఆర్ఎం డ్రెయిన్ న్యూ కోర్స్‌కు ఏర్పాటుచేసిన తూములు



వీరయ్య మురుగు కాల్వపై కూలిన కల్వర్టు

- గతేడాది జూన్‌లో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు
- పట్టించుకోని పాలకులు, డ్రెయినేజి అధికారులు
- కల్వర్టు నిర్మించి లాకులు ఏర్పాటు చేయాలని కోరుతున్న రైతులు

నగరం: పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం రైతుల పాలిట శాపంలా మారింది. రేపల్లె ప్రధాన మురుగు కాల్వ న్యూకోర్స్‌కు మురుగు నీటిని పంపే వీరయ్య మురుగు కాల్వ చివర కల్వర్టు శిథిలమై కూలింది. సుమారు 1500 ఎకరాల పంట పొలాలు ముంపునకు గురై పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది జూన్, జులైలో కురిసిన వర్షాలకు వీరయ్య మురుగు కాల్వ నుంచి రేపల్లె ప్రధాన మురుగుకాల్వ న్యూకోర్స్‌కు కలిపే కల్వర్టు కూలింది. దీంతో ఆర్ఎం డ్రెయిన్ నుంచి వచ్చిన నీటి ఉధృతికి వందలాది ఎకరాలలో వరి పంట నీటిపాలై తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో తమ సొంత డబ్బులతో రైతులు కూలిన కల్వర్టుకు ఇసుక బస్తాలు వేసి ఆర్ఎం డ్రెయిన్ నుంచి నీరు రాకుండా చర్యలు చేపట్టారు. అప్పటి నుంచి రైతులు అధికారులు, పాలకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు.

అధికారుల వింత వాదన

రేపల్లె ప్రధాన మురుగు కాల్వ న్యూకోర్స్ (ఆర్ఎం డ్రెయిన్) నుంచి వీరయ్య మురుగుకాల్వకు ఏర్పాటుచేసిన కల్వర్టు డ్రెయినేజీ శాఖ పరిధిలో లేదని ఆ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు విస్మయం చెందుతున్నారు. 20 ఏళ్ల కిందట కల్వర్టు నిర్మించారని అప్పటి నుంచి ఆర్ఎం డ్రెయిన్ నుంచి నీరు పంటపొలాల్లోకి రాకుండా లాకులు కిందకు దించేవారమని రైతులు చెబుతున్నారు. 2024 జూన్‌లో కురిసిన వర్షాలకు కల్వర్టు, లాకు సిస్టమ్ పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. డ్రెయినేజి పరిధిలో లేకపోతే గతంలో కల్వర్టు నిర్మించి లాకుల సిస్టమ్ ఎలా ఏర్పాటు చేశారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వీరయ్య మురుగు కాల్వపై కల్వర్టు నిర్మించి లాకుల సిస్టమ్ ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు.

కల్వర్టు నిర్మించాలి



ఆర్ఎం డ్రెయిన్ నుంచి నీటిప్రవాహం వీరయ్య మురుగు కాల్వలోకి రాకుండా ఏర్పాటుచేసిన కల్వర్టు కూలిపోవడంతో లాకుల సిస్టమ్ దెబ్బతింది. దీంతో పంట పొలాలు ముంపునకు గురై అపార నష్టం వాటిల్లింది. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించి లాకుల సిస్టమ్ ఏర్పాటుచేయాలి.

– మత్తి రాధాకృష్ణ, రైతు

బాధలు అర్థం చేసుకోండి



గతేడాది జూన్‌లో కురిసిన భారీ వర్షాలకు వీరయ్య మురుగు కాల్వపై ఉన్న కల్వర్టు కూలింది. వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. కల్వర్టు నిర్మించి లాకుల సిస్టమ్ ఏర్పాటుచేయకపోతే మరలా పంట దెబ్బతినే అవకాశముంది. మా బాధలు అర్థం చేసుకుని పాలకులు, అధికారులు తర్వితగతిన కల్వర్టు నిర్మాణం చేయాలి.

– పూషడపు సాంబశివరావు, రైతు

జూనియర్ సివిల్ జడ్జీలు బాధ్యతల స్వీకారం

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లాకు బదిలీపై వచ్చిన పలువురు జూనియర్ సివిల్ న్యాయమూర్తులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో జరిగిన జూనియర్ సివిల్ జడ్జీల బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు పలువురు వచ్చారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా వి.దీప్తి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా ఎం.జగదీశ్వరి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా దమ్మాలపాటి ధనురాజ్, నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా ఎం.శోభారాణి, ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ సీడీ సీబీడీ కోర్టు న్యాయమూర్తిగా మహమ్మద్ గౌస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తిగా బి.మేరీ సారా ధనమ్మ బాధ్యతలు స్వీకరించారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్‌పై అక్రమ కేసు



షేక్ మాబు

పిడుగురాళ్ల: సోషల్ మీడియా యాక్టివిస్టు షేక్ మాబును అక్రమ కేసులో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మాబు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నాడనే నెపంతోనే కూటమి నాయకులు పోలీసుల చేత అక్రమంగా అరెస్టు చేయించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 2024 సెప్టెంబర్ 11న సోషల్ మీడియా యాక్టివిస్టు వెన్నా రాజశేఖర్‌రెడ్డి, మాబుని అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు ఇబ్బందులు గురి చేశారు. ఈ సమయంలో మాబు తల్లిదండ్రులు హైకోర్టులో హెబిఎస్ కార్పస్ వేశారు. ఈ కేసును వెనక్కి తీసుకోవాలని కొంత కాలంగా వెన్నా రాజశేఖర్‌రెడ్డిని, మాబుని ఇబ్బందులు పెడుతూ వచ్చారు. పిడుగురాళ్ల పోలీసులు ఈ క్రమంలోనే తిరిగి బైకు దొంగతనం చేశారన్న నెపంతో మాబుని బ్రాహ్మణపల్లిలోని సిమెంట్ షాపు వద్ద నుంచి కొట్టుకుంటూ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అన్నను ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని, పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావును మాబు తమ్ముడు జానీ ప్రశ్నించారు. దాంతో బైకు దొంగతనం కేసు సంబంధించి విచారణకు తీసుకొని వచ్చామని తెలిపారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ అనే కారణంతోనే ఈ అక్రమ కేసులు బనాయించి తన అన్న మాబును పోలీస్‌స్టేషన్‌కు తరలించారని జానీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావును సాక్షి వివరణ కొరగా మాబుతో పాటు అతని అన్న బైక్ దొంగతనం కేసులో అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు.



క్లుప్తంగా

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.10 అడుగుల వద్ద ఉంది. ఇది 138.7364 టీఎంసీలకు సమానం.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో 1098 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 836, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,400. గరిష్ట ధర రూ.11,350, మోడల్ ధర రూ.11,000 పలికింది. కాయలు 262, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,400. గరిష్ట ధర రూ.11,350, మోడల్ ధర రూ.11,000 పలికింది. మొత్తం 823.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

ప్రధాని మోదీ సభకు 11 బస్సులు



కారంచేడు: అమరావతి పునఃప్రారంభోత్స కార్యక్రమానికి ప్రజలకు చేరవేసేందుకు ప్రభుత్వం 11 బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సుల ద్వారా 480 మందిని సభకు తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం ఈ బస్సులను మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా సహకార శాఖ అధికారి సీహెచ్ శ్యాంసన్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి బస్సుకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. బస్సుల్లో ఏఎన్ఎంలు, ఆశలు, మహిళా పోలీసులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ జి.నాగరాజు, ఎంపీడీఓ కె.నేతాజీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

చీరాల టౌన్: పశుపోషకులు తమ జీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాడి పరిశ్రమలో అభివృద్ధి సాధించాలని పశువైద్యురాలు పావని సూచించారు. మంగళవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గేదెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ దాణా పంపిణీ చేశారు. వైద్యురాలు పావని మాట్లాడుతూ పశుపోషకుల సంక్షేమం, పశువులు ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పశుపోషకులు యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటుగా పాల ఉత్పత్తి పెరిగేలా పోషక విలువలు కలిగిన దాణా పశువులకు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పోలీసులకు శిక్షపడే వరకు పోరాటం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: సోషల్ మీడియా యాక్టివిస్టులను కొట్టిన పోలీసులకు శిక్ష పడే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అభిమానంతో వైఎస్సార్ సీపీలో చురుకుగా పని చేస్తున్న బ్రాహ్మణపల్లి సర్పంచి కుమారుడైన మాబుపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని ఖండించారు. పార్టీలో చురుకుగా పని చేస్తున్నాడనే కారణంతోనే ఆరు, ఏడు నెలల కిందట మాబుపై, సోషల్ మీడియా గురజాల నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డిపై పోలీసులు కేసులు పెట్టి కొట్టారని ఆరోపించారు. దానిమీద అప్పుడే హెబియస్‌కార్పస్ వేశామని, హైకోర్టులో పోలీసుల మీద కేసులు కూడా వేసినట్లు తెలిపారు. అప్పుడు హైకోర్టు కూడా లోయర్ కోర్టులో సమస్యలు, జరిగిన దురాగతాలను మెజిస్ట్రేట్ ముందు రికార్డు చేయాలని 10 రోజుల కిందట తీర్పు వచ్చిందని వివరించారు. వీరు జడ్జి ముందు ఏమైనా చెబుతారోమోనని అక్రమంగా బెదిరించటానికి మరొక దొంగ కేసును అన్నదమ్ములు ఇద్దరి మీద పెట్టారని కాసు వివరించారు. ఇద్దరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైనికులు కావడంతో పోలీసులు ఎన్ని అక్రమ కేసులుపెట్టినా, కొట్టినా ఆదరకుండా, బెదరకుండా ఉన్నారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టుకున్నా న్యాయ పోరాటం చేస్తామని ధైర్యంగా నిలబడ్డారని తెలిపారు.పోలీస్‌స్టేషన్ ముట్టడి కోసం నాయకులు, కార్యకర్తలతో సిద్ధమయ్యామని, అయితే పోలీసులు మాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తామని చెప్పారు. దీంతో కోర్టులోనే న్యాయపరంగా తెల్చుకుంటామని కాసు స్పష్టం చేశారు. ఏది ఏమైనా హైకోర్టు ఇచ్చిన డైరెక్షన్‌పై వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రేపాల శ్రీనివాసరావు, కేవీ, చల్లా పిచ్చిరెడ్డి, చింతా సుబ్బారెడ్డి, బ్రాహ్మణపల్లి సర్పంచ్ బడేసా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల వచ్చిన సుబ్బారెడ్డి



అక్రమ అరెస్టు గురించి సుబ్బారెడ్డికి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం రాత్రి వచ్చారు. అనంతరం పార్టీ నేత అల్లు పిచ్చిరెడ్డి కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఈ క్రమంలోనే గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆహ్వానం మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. వీరిని కాసు మహేష్‌రెడ్డి దుశ్శాలువాలతో సన్మానించారు. కొంతసేపు ఈ ప్రాంత రాజకీయాల గురించి చర్చించారు. బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచి కుమారుడు మాబు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్టుగా చురుకుగా పని చేస్తుండటంతో పోలీసులు అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాసు మహేష్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ వాహనాల డ్రైవర్లు నిరసన

- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

నరసరావుపేట: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారంనిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాంబశివరావు మాట్లాడుతూ ఏడేళ్ల నుంచి నెలకు జీతం రూ.8800 మాత్రమే ఇస్తున్నారని, పీఎఫ్ వాటా కూడా డ్రైవర్ల వేతనాల నుంచి మినహాయిస్తున్నారని తెలిపారు. తమను కూడా ఆప్కాస్‌లో చేర్చి కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు డ్రైవర్లు కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ సిలార్ రసూల్ మాట్లాడుతూ బాలింతను వాహనంలో ఎక్కించుకున్నప్పుడు, ఆమెను ఇంటి దగ్గర దించాక యాప్ ద్వారా ఫొటో అప్లోడ్ చేసే క్రమంలో అది సక్రమంగా పనిచేయక డ్రైవర్లు పని ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. వారాంతపు, పండుగ సెలవులు, ఇంక్రిమెంట్లు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాల్ని చట్టప్రకారం అమలు చేయాలని కోరారు. సిబ్బందిని ఏజెన్సీ ద్వారా నియమించినా ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్నట్లు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓ లీలాకుమారికి వినతిపత్రం అందజేశారు. వాహనాల సంఖ్యను బట్టి అదనపు, బఫర్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఖాళీలను వెంటనే భర్తీ చేసి, సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైళ్లను రద్దు చేశామని డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైలు నంబర్ 57201 విజయవాడ–గుంటూరు, 57203 గుంటూరు–మాచర్ల, 57206 మాచర్ల–నడికుడి, 57205 నడికుడి–మాచర్ల, 57204 మాచర్ల–గుంటూరు, 57202 గుంటూరు–విజయవాడ, 6779 కాచిగూడ–నడికుడి, 67780 నడికుడి–కాచిగూడ రైళ్లు ఈ నెల 3, 4, 5 వ తేదీలలో రద్దు అయినట్లు తెలిపారు. ప్రయాణికులు దీనిని గమనించి సహకరించాల్సిందిగా తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో తీర్పు

గుంటూరు లీగల్: పల్నాడు జిల్లా గురజాల మండలం గొట్టిముక్కలకు చెందిన పేరం వెంకటరెడ్డి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండగా 2018లో నియంత్రణాధికారి దాడి జరిపి, ఆయన్ను అరెస్టు చేశారు. విచారణలో 2,690 వాట్స్ అదనంగా వినియోగించడం వలన సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి రూ.44,859 నష్టం కలిగించినట్లు తేలింది. దీనిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా 1వ జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఎ.ఎల్.సత్యవతి విచారణ చేపట్టారు. నేరం చేసినట్లు నిర్ధారించి, గతంలో కూడా నిందితుడె ఇదే నేరానికి పాల్పాడి అంగీకరించినందున రూ. 2.70 లక్షల జరిమానా విధించారు. ఈ మొత్తం కట్టని పక్షంలో నాలుగు నెలల జైలు అనుభవించాల్సి ఉంటుందని శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వజ్రాల రాజశేఖర రెడ్డి వాదనలు వినిపించారు.

'జనరల్ బోగీలు'కు బహుమతుల పంట

తెనాలి: రైలు జనరల్ బోగీల్లో ప్రయాణీకుల సమస్యలపై శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు నాటక సమాజం ప్రదర్శిస్తున్న 'జనరల్ బోగీలు' నాటిక వరుస విజయాలను సాధిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భట్టిప్రోలు మండల గ్రామం పల్లెకోనలో ఏప్రిల్ 27 నుంచి మే ఒకటో తేదీ వరకు జరిగిన పరుచూరి రఘుబాబు స్మారక 35వ అఖిల భారత నాటకోత్సవాలు–2025లో 'జనరల్ బోగీలు' నాటిక నాలుగు బహుమతులను సాధించటం విశేషం. నాటికల విభాగంలో ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక కావటమే కాకుండా ప్రధాన పాత్రల్లో నటించిన సురభి ప్రభావతి ఉత్తమ నటిగా, నాటిక దర్శకుడు, నటుడు గోపరాజు విజయ్ ఉత్తమ నటుడు బహుతులను అందుకున్నారు. ఈ నాటికను రచించిన విశాఖపట్నంకు చెందిన పీటీ మాధవ్ ఉత్తమ రచన బహుమతిని స్వీకరించారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, సమ్మెట వెంకటరమణ, డి.కృష్ణారావు వ్యవహరించారు.

ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు

చీరాల రూరల్: క్రీడలతో మానసిక వికాసం కలగడమే కాకుండా ధృఢ సంకల్పం సిద్ధిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల ఎన్ఆర్అండ్‌పిఎం హైస్కూలు క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ (9 ప్లస్ 3) పోటీలు ప్రారంభించారు. రాష్ట్రంలోని 16 క్రీడా జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు నూతలపాటి విజయకుమార్ (దాసు) తెలిపారు. చీరాలతోపాటు ఒంగోలు, గుంటూరు, విజయవాడ, ఏలూరు, నెల్లూరు, తిరుపతి, కాకినాడ, హైదరాబాదు, విశాఖపట్టణం వంటి నగరాల జట్లు వచ్చాయని తెలిపారు. పోటీల మొదటి రోజు మూడు జట్ల క్రీడాకారులు తలపడ్డారు. మొదటగా చీరాల ఎడ్విన్ మెమోరియల్ జట్టు కాకినాడ జట్టు క్రీడాకారులు తలపడగా 3–1 స్కోరు తేడాతో చీరాల ఎడ్విన్ మెమోరియల్ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో విశాఖపట్టణం శ్రీధర్ ఫుట్‌బాల్ జట్టు వర్సెస్ యునైటెడ్ లియోస్ జట్టు క్రీడాకారులు తలపడ్డారు. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో 3–1 స్కోర్ తేడాతో విశాఖపట్టణం శ్రీధర్ ఫుల్‌బాల్ క్లబ్ జట్టు గెలుపొందింది. రూ. 50,000, రూ. 30,000, రూ. 20,000 వరుస బహుమతులుగా అందజేయనున్నారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ అబ్రహం బ్లెస్సీ, ఎస్ఎంఎల్‌జే కాలేజీ ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, మున్సిపల్ కౌన్సిలర్ సల్లూరి సత్యానందం, ఆర్గనైజర్ నూతలపాటి విజయకుమార్ (దాసు), అంపైర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో బాలిక సత్తా



బ్రాంజ్‌మెడల్ సాధించిన ఆకాంక్ష రెడ్డి, కోచ్ సురేష్‌ను అభినందిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల రూరల్: జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో చీరాల వెదుళ్లపల్లికి చెందిన రాజు ఆకాంక్షరెడ్డి 29 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఫస్ట్ ఫెడరేషన్ కప్ సీపీయూ తైక్వాండో జాతీయస్థాయి చాంపియన్ షిప్–2025 పోటీలు గతనెల 30న డివిజనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నాసిక్‌లో నిర్వహించారు. చీరాల తైక్వాండో కోచ్ మల్లెల సురేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొంతుతున్న బాపట్లలోని జేమ్స్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్న వెదుళ్లపల్లికి చెందిన రాజు ఆకాంక్ష రెడ్డి 29 కేజీల విభాగంలో పాల్గొంది. తన ప్రత్యర్థిని చిత్తుచేసి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుంది. మన రాష్ట్రంతోపాటు చీరాల ప్రతిష్ఠను ఇనుమడింపచేసింది. కోచ్ సురేష్ ఆధ్వర్యంలో క్రీడాకారిణి ఆకాంక్ష రెడ్డి చీరాల ఒన్‌టౌన్ సీఐ సుబ్బారావును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆకాంక్ష రెడ్డి, కోచ్ సురేష్‌ను మెమోంటో అందజేసి ఘనంగా సత్కరించారు. అంతేకాక పలువురు క్రీడాభిమానులు, క్రీడా ప్రేమికులు వారిని అభినందించారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత



సీతారామరాజుకు బ్యాగు అప్పగిస్తున్న ఎస్ఐ

పర్చూరు(చినగంజాం): స్థానిక అమ్మ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేసేందుకు వచ్చి తన క్యాష్ బ్యాగును మరచిపోయి వెళ్లిపోయిన వ్యక్తికి.. అదే దుకాణంలో పని చేస్తున్న వ్యక్తి ఆ నగదు తిరిగి అప్పగించాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పొన్నూరు గ్రామానికి చెందిన డొక్కు సీతారామరాజు మొక్కజొన్న ట్రేడింగ్‌కు సంబంధించిన రూ 1.80 లక్షల నగదు ఉన్న బ్యాగు దుకాణంలో మరచి పోయి వెళ్లిపోయాడు. అమ్మ టిఫిన్ సెంటర్‌లో వర్కర్‌గా పనిచేస్తున్న ఆలపాటి ప్రసాద్ సీతారామరాజు..బ్యాగును గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాల్యాద్రికి అప్పగించాడు. సీతారామరాజుకు విషయం తెలియజేసి.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సమక్షంలో అతని క్యాష్ బ్యాగును అప్పగించారు. టిఫిన్ సెంటర్ వర్కర్ ప్రసాద్ నిజాయితీని పలువురు అభినందించారు.

వైభవంగా నాటికల పోటీలు ప్రారంభం



గంగోత్రి సాయికి సవ్యసాచి అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం



లీలామోహనరావుకు తుమ్మల సాంబశివరావు స్మారక అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు శుక్రవారం రాత్రి వైభవంగా ఆరంభమయ్యాయి. గ్రామంలోని చిన్న రథశాల వద్ద ప్రత్యేక వేదిక గద్దె శివరావు కళాప్రాంగణంలో ఏర్పాటైన నాటికల పోటీలను కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు వైఎస్‌కే ఎన్ స్వామి, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్, ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ జ్యోతిప్రజ్వలనతో ఆరంభించారు. సభకు పొన్నూరు కళాపరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ.. ఆంధ్రాప్యారిస్ తెనాలి కళల కాణాచిగా వర్ధిల్లితే, ఎందరో కళాకారులకు జన్మనిచ్చిన పుణ్యభూమి కొలకలూరు అని చెప్పారు. వల్లూరు వెంకట్రామయ్య, మోదుకూరి జాన్సన్, డీఎస్ దీక్షిత్ వంటి నాటకరంగ ప్రముఖులు, ఎందరో సాహితీవేత్తలు కొలకలూరు నుంచి ఉద్భవించారని సోదాహరణంగా చెప్పారు. ఏటా నాటికల పోటీలను నిర్వహిస్తూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడిన నాటకరంగ ప్రముఖుల పేరుతో అవార్డులను ప్రదానం చేస్తున్న శ్రీసాయి ఆర్ట్స్ సంస్థ నిర్వాహకులు అభినందనీయులని చెప్పారు. ఇదే వేదికపై తాడేపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, నాటక సంస్థ నిర్వాహకుడు గంగోత్రి సాయికి నటుడు, దర్శకుడు కరణం సురేష్ జ్ఞాపకార్థం ప్రదానం చేసే సవ్యసాచి అవార్డును బహూకరించారు. ప్రముఖ సంగీత దర్శకుడు తుమ్మల సాంబశివరావు స్మారకంగా మరో సంగీత దర్శకుడు పి.లీలామోహనరావును సత్కరించారు. వరగాని పరిషత్ అధ్యక్షుడు పోపూరి నాగేశ్వరరావు, ఎన్టీఆర్ కళాపరిషత్, అనంతవరం అధ్యక్షుడు గుదె పాండురంగారావు, కొండవీటి కళాపరిషత్, లింగారావుపాలెం అధ్యక్షుడు కట్టా శ్రీహరి, ఎన్టీఆర్ కళాపరిషత్, వినుకొండ అధ్యక్షుడు కూచి రామాంజనేయులు, కళాంజలి, చీరాల కార్యదర్శి తిరుమలశెట్టి సాంబశివరావు మాట్లాడారు. నిర్వాహక సంస్థల అధినేతలు, రంగస్థల, సినీ నటులు గోపరాజు రమణ, గోపరాజు విజయ్, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రశ్నించే వారి గొంతు నులిమేస్తే ఎలా?



సత్తెనపల్లిలో ప్రసాదరావును హౌస్ అరెస్ట్ చేసి కాపలా ఉన్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు హౌస్ అరెస్ట్
- ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా పోలీసులు నిర్బంధం

సత్తెనపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించకుండా .. వాటిని కనీసం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లకుండా ప్రశ్నించే వారి గొంతు నులిమేస్తే సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆవ్వారు ప్రసాదరావు ప్రశ్నించారు. అమరావతి రాజధానికి మోదీ వస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి ప్రసాదరావును అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేశారు. గురువారం రాత్రి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన ఆ రోజు అందుబాటులో లేరు. శుక్రవారం పోలీసులు పలు ప్రశ్నలు సంధించారు. వాటికి సమాధానం చెప్పినప్పటికీ సంతృప్తి చెందలేదు. ఇద్దరు కానిస్టేబుల్‌లను ఇంటి వద్ద ఉంచి ప్రసాదరావును గృహ నిర్బంధం చేశారు. దీన్ని ఆయన ప్రశ్నించారు. మోదీ సభ పూర్తయ్యే వరకు నిర్బంధం తప్పదని పోలీసులు తేల్చి చెప్పారు. శుక్రవారం రాత్రి 7:30 గంటలకు పోలీసులు వెళ్లిపోవడంతో ఆయన బయటికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ '' మేము ఏమైనా దొంగలమా.. దోపిడీలు, మర్డర్లు చేశామా..మరి ఎందుకు గృహ నిర్బంధం చేశార''ని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలకులు వాస్తవాలను గమనించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. గృహ నిర్బంధాలు చేసినంత మాత్రాన ప్రయోజనం లేదని, దీనికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

సీపీఎం నాయకుల హౌస్ అరెస్టులు హేయం

సత్తెనపల్లి: మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని పునః నిర్మాణం ప్రారంభం కోసం వస్తున్న నేపథ్యంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని సీపీఎం నాయకులను పట్టణ పోలీసులు హౌస్ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి సీపీఎం వ్యతిరేకం కాదని, రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుకు కూడా ఆహ్వానం పంపారని తెలిపారు. కానీ సభకు వెళ్లవద్దంటూ నాయకులను ఎలా అరెస్టు చేస్తారని ఆయన ప్రశ్నించారు. గురువారం రాత్రి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు అవ్వారు ప్రసాదరావు ఇంటిని పోలీసులు సోదా చేయడాన్ని ఆయన ఖండించారు. ఆయన్ను హౌస్ అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సత్తెనపల్లి రూరల్ సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, ముప్పాళ్ల మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ ఇళ్ల వద్ద, సీపీఎం కార్యాలయం వద్ద పోలీసులను పెట్టి హౌస్ అరెస్టులు చేయడాన్ని దుయ్యబట్టారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల్ని కేంద్రం నుంచి అప్పుగా కాకుండా గ్రాంట్‌గా రాబట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు జడ రాజకుమార్, ఎం. హరిపోతు రాజులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



రేపల్లె : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో సుచిత్ర చెప్పారు. బాపట్ల జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని శివాజీ మున్సిపల్ స్కూల్లో కిశోరీ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను గ్రామీణలకు తెలియజెప్పాలన్నారు. యువతికి 18 , యువకుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలనే దిశగా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమన్నారు. రూ. లక్ష జరిమానా రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాంచారమ్మ, వెంకట రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి హౌస్ అరెస్ట్



మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, నాయకులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

లక్ష్మీపురం: ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని పునఃప్రారంభానికి వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తూర్పు నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు షేక్ మస్తాన్ వలిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎవరూ స్పందించలేదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో అమరావతికి వచ్చిన సమయంలో ప్రధాని మోదీగుప్పెడు మట్టి, పాచి పోయిన లడ్డు, చెంబులో నీరు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సారి వచ్చి అందరిని యోగా చేయాలని సూచించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హౌస్ అరెస్టులు సరి కాదని పేర్కొన్నారు.